మా కలం.. మీ గళం..
RNI : APTEL/ 2017/74310
# మన గళం
దిన పత్రిక
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ   పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర   సంపుటి : 08   సంచిక : 210   బుధవారం   04 - 02 - 2026   పేజీలు: 8   వెల: 4

## విశాఖలో అంతర్జాతీయ నౌకాదళ వేడుకలు



2లో..



### రక్షణ కొనుగోలు విధానంలో
# మార్పులు

- త్వరలో కొత్త డీఏపీ అమలు
- కొనుగోలు ప్రక్రియకు వేగం
- సాంకేతిక మార్పులకు అనుగుణంగా సవరణలు
- ప్రజా సంప్రదింపులకు ముసాయిదా విడుదల

మన గళం, న్యూఢిల్లీ : దేశ రక్షణ అవసరాలకు అనుగుణంగా కొనుగోలు ప్రక్రియను మరింత సమర్థవంతంగా మార్చే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ప్రస్తుతం అమలులో ఉన్న రక్షణ కొనుగోలు విధానంలోని లోపాలను సరిదిద్దుతూ, సవరించిన రక్షణ కొనుగోలు విధానాన్ని త్వరలో అమల్లోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఈ మార్పుల 2 లో..



### తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారంపై విచారణ
# కమిషన్‌కు ఆమోదం

- కల్తీ ఆరోపణలపై లోతైన దర్యాప్తుకు నిర్ణయం
- సిట్ నివేదిక-ఛార్జ్‌షీట్ మధ్య వ్యత్యాసాలపై చర్చ
- భక్తుల విశ్వాసాన్ని కాపాడే దిశగా ప్రభుత్వం చర్యలు

మన గళం, అమరావతి : తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడకం ఆరోపణలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ వ్యవహారంపై లోతైన దర్యాప్తు జరిపి అసలు వాస్తవాలను వెలికితీయడానికి ప్రత్యేక విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కేబినెట్ ఏకగ్రీవంగా తీర్మానించింది. మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. కల్తీ నెయ్యి వ్యవహారంపై సిట్ సమర్పించిన నివేదిక, కోర్టులో దాఖలు చేసిన ఛార్జ్‌షీట్, ప్రభుత్వానికి అందిన సమాచారం మధ్య గణనీయమైన వ్యత్యాసాలు ఉన్నట్లు కేబినెట్ గుర్తించింది. సిట్ విచారణలో వెలుగులోకి వచ్చిన కొన్ని కీలక అంశాలు ఛార్జ్‌షీట్‌లో ఎందుకు పొందుపర





చలేదన్న అంశంపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చ జరిగింది. ఈ మూడు అంశాల మధ్య ఉన్న తేడాలను సమగ్రంగా పరిశీలించి, అసలు సూత్రధారులు ఎవరు, వాస్తవంగా ఏమి జరిగిందన్నది నిగ్గు తేల్చేందుకే విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. తిరుమల లడ్డూ పవిత్రతపై భక్తుల్లో ఏర్పడిన అనుమానాలను పూర్తిగా నివృత్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపింది. విచారణ కమిషన్ నివేదిక అందిన అనంతరం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కేబినెట్ పేర్కొంది. తిరుమల శ్రీవారి ప్రసాదం విషయంలో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరిస్తామని, భక్తుల విశ్వాసాన్ని కాపాడటమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యతగా ఉంటుందని మంత్రివర్గం స్పష్టం చేసింది.

### కేంద్ర బడ్జెట్-2026పై తీరప్రాంత
# అభివృద్ధికి ప్రాధాన్యం



- ☐ పౌర విమానయాన శాఖ కార్యాలయంలో కీలక భేటీ
- ☐ తీరప్రాంత కార్గో, మత్స్య సంపదపై సమీక్ష
- ☐ ఉత్తరాంధ్ర జీవనోపాధుల బలోపేతానికి చర్యలు

మన గళం, న్యూఢిల్లీ : కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రాంమోహన్ నాయుడు నేడు న్యూఢిల్లీలోని తన కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ శాసనసభ గౌరవ సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడుతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తాజాగా ప్రకటించిన కేంద్ర బడ్జెట్-2026 అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ భేటీలో ముఖ్యంగా తీరప్రాంత కార్గో మౌలిక సదుపాయాల అభివృద్ధి, మత్స్య సంపద వృద్ధి, అలాగే జీడి, కొబ్బరి, గంధం వంటి అధిక విలువ కలిగిన పంటల ప్రోత్సాహం ద్వారా తీరప్రాంత జీవనోపాధులను బలోపేతం చేసే అవకాశాలపై సమీక్షించారు. ఉత్తరాంధ్ర 2 లో..



### అంబటి రాంబాబు కుటుంబానికి
# జగన్ భరోసా

- గుంటూరుకు వెళ్లనున్న వైయస్ జగన్
- ధ్వంసమైన ఇల్లు, కార్యాలయ పరిశీలన
- కుటుంబ సభ్యుల పరామర్శ

మన గళం, గుంటూరు : టీడీపీ గూండాల దాడిలో తీవ్రంగా ధ్వంసమైన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత అంబటి రాంబాబు కుటుంబానికి భరోసా ఇచ్చేందుకు పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఈ నెల 4న గుంటూరుకు వెళ్లనున్నారు. దాడి ఘటనపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. గుంటూరు పర్యటనలో భాగంగా వైయస్ జగన్ ముందుగా అంబటి రాంబాబు 2 లో..

### అధిక ధరలకు మద్యం విక్రయాలు
# నిబంధనలకు విరుద్ధం

- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్
- ఎంఆర్‌పీ మించి విక్రయాలపై ఫిర్యాదులు
- ప్రభుత్వానికి చెడ్డ పేరు తేవద్దని హెచ్చరిక
- దుకాణాలపై నిఘా పెంచాలని ఎక్సైజ్ శాఖకు ఆదేశాలు



మన గళం, అమరావతి : రాష్ట్ర వ్యాప్తంగా మద్యం దుకాణాల్లో ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదులు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు అందాయి. కాకినాడ జిల్లాతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి ఈ తరహా ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన దృష్టికి వెళ్లింది. ఈ ఫిర్యాదులను పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి, ఎంఆర్‌పీ మించి మద్యం విక్రయించడం నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని స్పష్టం చేశారు. ఇలాంటి చర్యలు ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకువస్తాయని హెచ్చరించారు. మద్యం విక్రయాల విషయంలో దుకాణదారులు కచ్చితంగా ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సిందేనని ఆయన తేల్చిచెప్పారు. ఈ వ్యవహారంపై సంబంధిత శాఖ అధికారులు అప్రమత్తంగా 2 లో..

## ముని్సపల్ ఎన్నికల భద్రతపై డీజీపీ ఆదేశాలు


- పోలీసు యంత్రాంగానికి అప్రమత్తత సూచన
- అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా చర్యలు
- సీపీలు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్





మన గళం, హైదరాబాద్ : మున్సిపల్ ఎన్నికలను సమర్ధవంతంగా, శాంతియుతంగా నిర్వహించాలని రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి ఐపీఎస్ పోలీసు అధికారులకు సూచించారు. ఎన్నికలు జరగనున్న ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఎన్నికలు నిర్వహించనున్న జిల్లాల పోలీసు కమిషనర్లు, ఎస్పీలు, స్టేషన్ హౌజ్ ఆఫీసర్లతో డీజీపీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల సమయంలో చట్టసువ్యవస్థ 2 లో..

## స్మార్ట్ మీటర్లపై విద్యుత్ బిల్లుల భారం తగ్గింపు



- రియాక్టివ్ ఎనర్జీ ఛార్జీలపై కీలక నిర్ణయం
- 2019-20 టారిఫ్ ఆర్డర్ అమలు నిలుపుదల

2 లో..

## మన్రేగా చట్టాన్ని పునరుద్ధరించాలి



మన గళం, అనంతపురం : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ (మన్రేగా) చట్ట పరిరక్షణ యాత్ర రెండో రోజు కూడా అనంతపురం జిల్లాలో కొనసాగింది. కళ్యాణదుర్గం నియోజకవర్గం ఐదుకల్లు గ్రామంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేత వైఎస్ షర్మిల పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మన్రేగా చట్టాన్ని 2 లో..

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక



# రక్షణ కొనుగోలు విధానంలో మార్పులు

ద్వారా రక్షణ సామగ్రి కొనుగోళ్లలో జాప్యం తగ్గించి, వేగంగా మారుతున్న సాంకేతిక పరిణామాలకు తగినట్లు నిర్ణయాలు తీసుకునేలా వ్యవస్థను తీర్చిదిద్దనున్నారు. సవరించిన విధానంలో ప్రధానంగా కొనుగోలు ప్రక్రియకు పడుతున్న కాలాన్ని గణనీయంగా తగ్గించడంపై దృష్టి సారించారు. కొనుగోలు పూర్తయ్యేలోపే సాంకేతికంగా పాతబడిపోతున్న పరిస్థితిని నివారించేందుకు, సమయపాలనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారుతున్న నేపథ్యంలో, రక్షణ రంగంలో తాజా పరిష్కారాలు సకాలంలో అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ సవరించిన రక్షణ కొనుగోలు విధానంపై సమీక్ష ప్రక్రియ తుదిదశకు చేరుకున్నట్లు తెలుస్తోంది. వచ్చే వారం రోజుల్లో ఈ ముసాయిదాను ప్రజా సంప్రదింపుల కోసం విడుదల చేయనున్నారు. పరిశ్రమలు, నిపుణులు, సంబంధిత వర్గాల నుంచి అభిప్రాయాలు సేకరించిన అనంతరం తుది రూపం ఇవ్వనున్నారు. ప్రజా సంప్రదింపుల ప్రక్రియ పూర్తయ్యాక, 2026 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికి ముందే సవరించిన రక్షణ కొనుగోలు విధానాన్ని ఖరారు చేసి అమలు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తోంది. ఈ మార్పులు అమలులోకి వస్తే, దేశ రక్షణ సామర్థ్యం మరింత బలపడటంతో పాటు, కొనుగోలు వ్యవస్థలో పారదర్శకత, వేగం పెరిగే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

# కేంద్ర బడ్జెట్-2026పై తీరప్రాంత అభివృద్ధికి ప్రాధాన్యం



ప్రాంత అభివృద్ధికి ఈ రంగాలు కీలకమని కేంద్ర మంత్రి రాంమోహన్ నాయుడు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య ప్రక్రియలు, రాజ్యాంగ విలువలపై సభాపతి అయ్యన్నపాత్రుడుకు ఉన్న లోతైన అవగాహనను ఈ సందర్భంగా కేంద్ర మంత్రి ప్రశంసించారు. అలాగే, ఆయనతో ఉన్న దీర్ఘకాలిక అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, కేంద్రం-రాష్ట్రం సమన్వయంతో అభివృద్ధి లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

# మున్సిపల్ ఎన్నికల భద్రతపై డీజీపీ ఆదేశాలు



పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు ఆదేశించారు. సున్నిత ప్రాంతాలను గుర్తించి అదనపు బందోబస్తు ఏర్పాటు చేయాలని, సమస్యాత్మక వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని డీజీపీ సూచించారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలు ప్రశాంతంగా జరిగేలా అన్ని స్థాయిల్లో సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో పోలీసులు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు భద్రతా భావన కలిగేలా విధులు నిర్వర్తించాలని డీజీపీ బి. శివధర్ రెడ్డి ఐపీఎస్ అధికారులకు స్పష్టం చేశారు.

### అధిక ధరలకు మద్యం విక్రయాలు

# నిబంధనలకు విరుద్ధం

ఉండాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు. మద్యం దుకాణాలపై నిరంతర నిఘా ఏర్పాటు చేసి, అధిక ధరలకు మద్యం విక్రయించే దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులకు సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మద్యం విక్రయ వ్యవస్థను పారదర్శకంగా నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## అంబటి రాంబాబు కుటుంబానికి జగన్ భరోసా

నివాసం, కార్యాలయాన్ని పరిశీలించనున్నారు. దాడిలో జరిగిన నష్టాన్ని ప్రత్యక్షంగా చూసి, పూర్తి వివరాలను తెలుసుకోనున్నారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి అండగా నిలుస్తామని భరోసా ఇవ్వనున్నట్లు సమాచారం. ఈ ఘటనను ప్రజాస్వామ్యంపై దాడిగా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభివర్ణిస్తోంది. రాజకీయ విభేదాల పేరుతో దాడులు, విధ్వంసాలకు పాల్పడటం దుర్మార్గమని పార్టీ నేతలు విమర్శిస్తున్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అంబటి రాంబాబు కుటుంబానికి పార్టీ పూర్తిస్థాయిలో మద్దతుగా ఉంటుందని, ఇలాంటి దాడులకు భయపడే ప్రసక్తే లేదని వైయస్ జగన్ స్పష్టం చేయనున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

# స్మార్ట్ మీటర్లపై విద్యుత్ బిల్లుల భారం తగ్గింపు

**- రియాక్టివ్ ఎనర్జీ ఛార్జీలపై కీలక నిర్ణయం - 2019--20 టారిఫ్ ఆర్డర్ అమలు నిలుపుదల**



మన గళం, అమరావతి : స్మార్ట్ మీటర్ల అమలుతో విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయన్న వినియోగదారుల ఆందోళనలకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) ఊరటనిచ్చింది. మీటర్లలో లోపాల కారణంగా కాకుండా, రియాక్టివ్ ఎనర్జీ (కేవీఏఆర్‌హెచ్)కు సంబంధించిన అదనపు ఛార్జీల వల్లే బిల్లులు పెరిగినట్టు స్పష్టం చేసింది ఈ నేపథ్యంలో 2019--20 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన టారిఫ్ ఆర్డర్‌లోని 'లీడింగ్ కేవీఏఆర్‌హెచ్'పై వసూలు చేసే నిబంధనను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు ఏపీఈఆర్సీ ప్రకటించింది. దీంతో స్మార్ట్ మీటర్ల కారణంగా వినియోగదారులపై అదనపు ఆర్థిక భారం పడకుండా చర్యలు తీసుకున్నట్టయింది. ఇప్పటికే అధికంగా వసూలు చేసిన మొత్తాలను రాబోయే విద్యుత్ బిల్లుల్లో సర్దుబాటు చేయాలని విద్యుత్ పంపిణీ సంస్థలను ఏపీఈఆర్సీ ఆదేశించింది. దీని వల్ల వినియోగదారులు నష్టపోకుండా రక్షణ కల్పించినట్టవుతుందని తెలిపింది. అయితే, స్మార్ట్ మీటర్లు విద్యుత్ సరఫరాలో సమర్థత, పారదర్శకత, విశ్వసనీయత పెంచే దిశగా కీలకమని ఏపీఈఆర్సీ పేర్కొంది. వినియోగదారుల సంక్షేమాన్ని కాపాడుతూనే, ఆధునిక సాంకేతికతను ప్రోత్సహించడమే తమ లక్ష్యమని స్పష్టం చేసింది.

# మన్రేగా చట్టాన్ని పునరుద్ధరించాలి

పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రచ్చబండలో మాట్లాడిన గ్రామస్థులు, 2006లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నేతృత్వంలో ప్రారంభమైన ఉపాధి హామీ పథకం తమ జీవితాల్లో గణనీయమైన మార్పులు తీసుకొచ్చిందని తెలిపారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు జరిగాయని, వలసలు తగ్గాయని పేర్కొన్నారు. అలాంటి చట్టాన్ని బలహీనపరచే ప్రయత్నాలు దారుణమని వారు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా వైఎస్ షర్మిల మాట్లాడుతూ, మన్రేగా చట్టం గ్రామీణ పేదలకు జీవనాధారంగా నిలిచిందని గుర్తు చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని పక్కన పెట్టి కొత్త చట్టాల పేరుతో కేంద్ర ప్రభుత్వం కరువు పనులపై కుట్రలు చేస్తోందని విమర్శించారు. గ్రామీణ ప్రజల హక్కులను కాలరాసే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ సహించదని స్పష్టం చేశారు. మన్రేగా పరిరక్షణ పోరాటానికి ఐదుకల్లు గ్రామస్థులు ముక్తకంఠంతో మద్దతు ప్రకటించడం కాంగ్రెస్ పార్టీకి మరింత బలం చేకూర్చిందని షర్మిల అన్నారు. ఉపాధి హామీ చట్టం పూర్తి స్థాయిలో అమలయ్యే వరకు, గ్రామీణ పేదలకు న్యాయం జరిగే వరకు ఈ పోరాటం



కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు.

# విశాఖలో అంతర్జాతీయ నౌకాదళ వేడుకలు

**- ఫిబ్రవరి 18 నుంచి అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ - ఫిబ్రవరి 19 నుంచి మిలాన్--2026 విన్యాసాలు**

**- ప్రపంచ నౌకాదళాలకు ఆతిథ్యం ఇవ్వనున్న విశాఖ**

మన గళం, విశాఖపట్నం : ప్రపంచ స్థాయి నౌకాదళ వేడుకలకు విశాఖపట్నం సన్నద్ధమవుతోంది. ఫిబ్రవరి 18 నుంచి అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్), ఫిబ్రవరి 19 నుంచి మిలాన్-2026 నౌకాదళ విన్యాసాలు నగరంలో నిర్వహించనున్నారు. ఈ రెండు ప్రతిష్టాత్మక కార్యక్రమాలకు ప్రపంచంలోని పలు దేశాల నౌకాదళాలు హాజరుకానున్నాయి. ఈ వేడుకల నిర్వహణకు సంబంధించి తూర్పు నౌకాదళ కమాండ్ ఉన్నతాధికారులు రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో కలిసి ఏర్పాట్లను సమీక్షించారు. భద్రత, వసతి, రవాణా, లాజిస్టిక్స్ వంటి అంశాలపై సమగ్రంగా చర్చించి, ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని నిర్ణయించారు. అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ ద్వారా భారత నౌకాదళ సామర్థ్యం, సముద్ర భద్రతలో భారత్ పాత్రను ప్రపంచానికి చాటనున్నారు. అలాగే మిలాన్-2026 విన్యాసాల ద్వారా మిత్ర దేశాల నౌకాదళాలతో



సహకారం, పరస్పర అవగాహన మరింత బలోపేతం కానుంది. ఈ రెండు కార్యక్రమాలతో విశాఖపట్నం ప్రపంచ సముద్ర వేదికపై ప్రత్యేక గుర్తింపు పొందనుంది. నగరానికి ఇది గర్వకారణమైన సందర్భమని, రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రతిష్టలు తీసుకువచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

# వైసీపీ నేతల ఇళ్ల దాడులపై పోలీసులకు దేవినేని అవినాష్ ఫిర్యాదు

## – టీటీడీ లడ్డు ప్రసాదంపై అసత్య ప్రచారాలపై ఆగ్రహం

మన గళం, విజయవాడ : వైసీపీ నేతల ఇళ్లపై జరిగిన దాడులు, టీటీడీ లడ్డు ప్రసాదంపై కావాలనే అసత్య ప్రచారాలు చేస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్ మాచవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కలిసి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై అవాస్తవాలు ప్రచారం చేశారని ఆరోపించారు. సీబీఐ నివేదికలో నిజాలు బయటపడ్డాయని, కూటమి నేతలు చెప్పిందంతా పచ్చి అబద్ధమని ప్రజలకు స్పష్టంగా అర్థమైందన్నారు.

**– డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా దాడులు**

టీటీడీ లడ్డు వ్యవహారంలో అడ్డంగా దొరికిపోయిన కూటమి నేతలు ప్రజల దృష్టి మళ్లించేందుకే డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారని దేవినేని అవినాష్ ఆరోపించారు. అందులో భాగంగానే మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటిపై దాడి జరిగిందని, టీడీపీ నేతలు కర్రలు, రాడ్లతో దాడులకు పాల్పడ్డారని చెప్పారు. మహిళలు ఉన్న ఇళ్లను కూడా చూడకుండా తగలబెట్టడం అత్యంత దారుణమని విమర్శించారు. అలాగే మాజీ మంత్రి జోగి రమేష్ ఇంటిపై కూడా అన్యాయంగా దాడి జరిగిందని, ఈ ఘటనలు నారా లోకేష్, ఎంపీ కేశినేని చిన్ని ఆధ్వర్యంలోనే జరిగాయని ఆరోపించారు. పోలీసుల వైఖరిపై తీవ్ర విమర్శలు విజయవాడలో పెట్రోల్ బాంబుల సంస్కృతి తీసుకొచ్చారని, పోలీసులు టీడీపీ గుండాలతో మంతనాలు జరిపి దాడులకు సహకరించారని దేవినేని అవినాష్ ఆరోపించారు. పోలీస్ వ్యవస్థ పూర్తిగా దిగజారిపోయిందని, ఆదివారం రౌడీషీటర్ల కౌన్సెలింగ్ పేరుతో దాడులకు ప్రోత్సహించారని విమర్శించారు. నిజంగా చట్టపాలన ఉంటే దాడి చేసిన వారిని నడిరోడ్డుపై అరెస్ట్ చేసి చూపించాలని డిమాండ్ చేశారు. టీటీడీ లడ్డు ప్రసాదంపై అసత్యాలు ప్రచారం చేసిన చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌లు వెంటనే బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఆయన కోరారు.

# వికసిత భారత్ లక్ష్యంగా 2026 కేంద్ర బడ్జెట్ : సూరవరం మల్లీశ్వరి

మన గళం పెద్ద దోర్నాల మండలం : దోర్నాల మండల బీజేపీ పార్టీ అధ్యక్షురాలు సూరవరం మల్లీశ్వరి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026 బడ్జెట్‌ను ప్రశంసించారు. వికసిత భారత్ లక్ష్యంగా అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, ఆర్థిక వృద్ధిని దృష్టిలో పెట్టుకొని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బడ్జెట్‌లో విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళల సాధికారత, మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక రంగాలకు పెద్ద పీట వేశారని తెలిపారు. ముఖ్యంగా మధ్య తరగతి కుటుంబాలకు పన్ను రాయితీలు కల్పించడం, యువతకు ఉపాధి అవకాశాలు పెరిగేలా చర్యలు తీసుకోవడం ఈ బడ్జెట్ ప్రత్యేకతగా ఉందన్నారు. అలాగే ఐటి, ఫార్మా, బయోఫార్మా రంగాలకు ప్రోత్సాహం అందించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కూడా ఈ బడ్జెట్ ఊతం ఇస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు. దేశ పురోగతికి ఇది మరో బలమైన అడుగుగా నిలుస్తుందని సూరవరం మల్లీశ్వరి తెలిపారు.




# ఆదోనిను జిల్లాగా ప్రకటించాల్సిందే

- 54వ రోజు రిలే దీక్షల్లో జంగమ వీరశైవ లింగాయత్ సంఘం సభ్యులు.





(ఆలూరు మనగళం, ఫిబ్రవరి 03) : వెనుకబడిన ఆలూరు ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఆదోనిను జిల్లా గా ప్రకటించాలని జంగమ, వీరశైవ లింగాయత్ సంఘం ఆలూరు అధ్యక్షులు వీరభద్ర గౌడ్ డిమాండ్ చేశారు. ఆలూరు జెఏసి అద్వర్యం లో కొనసాగుతున ఆదోని జిల్లా సాదన రిలే దీక్షలు మంగళవారం కు 54వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో వీరశైవ లింగాయత్ సంఘం సభ్యులు భీమా, మల్లీ గౌడ్, బసవరాజు గౌడ్, ఆనంద్, విరూపాక్షి, జగదీష్,రామన్న గౌడ్, చిన్న కొండప్ప, సిద్దప్ప, నాగరాజు, కుమార్ గౌడ్, ఈశ్వర్ గౌడ్, గజేంద్ర, నవీన్ కూర్చున్నారు. వీరికి జెఏసి నాయకులు కత్తి రామాంజనేయులు, ఎల్లప్ప, పూల రామాంజనేయులు, సిసిఐ నాయకులు రామాంజినేయులు సంఘీభావం తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలని వారు కోరారు.

# అభిమానం చాటుకున్న... వీర అభిమాని మాజీ ఎన్నారై వెంకట్.

- టిడిపి అధిష్టానం ఆలూరు ఇంచార్జిగా వైకుంఠం జ్యోతి ను నియమిస్తే.
- తిరుమలకు వస్తానని మొక్కుకున్న వైకుంఠం వీర అభిమాని మాజీ ఎన్నారై వెంకట్.


(ఆలూరు మనగళం, ఫిబ్రవరి 03): ఆలూరు తెలుగుదేశం పార్టీ ఇంచార్జిగా టీడీపీ అధిష్టానం వైకుంఠం జ్యోతి ను నియమిస్తే, తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి వారికి శ్రీవారి పాదాలు నుండి కాలినడకన వస్తానని మొక్కుకొన్న వైకుంఠం వీర అభిమాని మాజీ ఎన్నారై వెంకట్. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ అధినేత సీఎం చంద్రబాబు నాయుడు మరియు రాష్ట్ర విద్య శాఖమంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు ఆలూరు టీడీపీ ఇంచార్జి వైకుంఠం జ్యోతి కి ఇంచార్జి బాధ్యతలు రావడంతో నాకు చాలా సంతోషంగా ఉంది, కావున సోమవారం తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి మొక్కు చిర్చుకోవడానికి వెళ్లి, నేను మొక్కను శ్రీవారి పాదాల మెట్ల నుంచి కాలినడకన నడుచుకుంటూ, మెట్ల మార్గంలో మెట్టు మెట్టుకు కర్పూరం వెలిగించి మొక్కు తీర్చుకున్నా మాజీ ఎన్నారై వెంకట్. అనంతరం వైకుంఠం వీరాభిమాని వెంకట్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు మరియు రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ బాబు కు, టిడిపి రాష్ట్ర అధ్యక్షడు పల్లా శ్రీనివాస్ యాదవ్, వైకుంఠం జ్యోతి శివప్రసాద్ దంపతులకు శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, అలాగే ఆలూరు నియోజకవర్గం వైకుంఠం జ్యోతి చేతులమీదుగా మరింత అభివృద్ధి చెందాలని, కలియుగ దైవం అయిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం వైకుంఠం





జ్యోతి, వైకుంఠం శివ ప్రసాద్ దంపతులు మరియు కుటుంబ సభ్యులు శ్రీరామ్, సాయి దినేష్ లు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వందేళ్లు జీవించాలని, కుటుంబం చల్లగా ఉండాలని మనసార శ్రీవారిని మొక్కుకున్నట్లు వెంకట్ తెలిపారు.

# సమాజసేవే నిజమైన ఆరాధన : షేక్ షేక్షావలి



పెద్ద దోర్నాల, మన గళం : దేవుని ప్రేమించడం అంటే కేవలం ప్రార్థనలకే పరిమితం కాకుండా, అవసరంలో ఉన్న సాటి మనిషికి సహాయం చేయడమే నిజమైన భక్తి అని పెద్ద దోర్నాల మండల సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ షేక్షావలి అన్నారు. మంగళవారం పెద్ద దోర్నాల మండలం చిన్న దోర్నాలలోని ఏబీఎం చర్చిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పాస్టర్లతో నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనను పాస్టర్లు ఘనంగా సన్మానించారు. సన్మాన సభలో షేక్ షేక్షావలి మాట్లాడుతూ, మనము పుట్టినప్పుడు ఏమీ తీసుకురాలేదు, మరణించే సమయంలో ఏమీ తీసుకుపోలేము. అందుకే జీవించిన కాలంలో సమాజానికి మన వంతు సేవ చేయడమే దేవునికి చేసే నిజమైన సేవ అని పేర్కొన్నారు. కుల, మత భేదాలు లేకుండా తాను సంపాదించిన దానిలో కొంత భాగాన్ని పేదలు, అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడమే తన జీవిత లక్ష్యమని తెలిపారు. ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించడం, బాధలో ఉన్నవారికి ధైర్యం ఇవ్వడం, వృద్ధులు, అనాథలకు అండగా నిలవడం దేవునికి ప్రీతికరమైన కార్యాలన్నారు. బైబిల్‌లో చెప్పిన "నిన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించుము" అనే బోధను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన "ప్రైస్ ది లార్డ్" అంటూ వందనాలు తెలపడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో సేఫ్టీ డ్రైవర్స్ యూనియన్ సభ్యులు షేక్ సర్దార్, షేక్ మున్న, షేక్ షాందు, షేక్ అబ్దుల్లా, షేక్ మౌలాలి, శీను తదితరులు పాల్గొన్నారు.

# చలో పోతిరెడ్డిపాడు పోస్టర్ ఆవిష్కరణ



మన గళం కోడుమూరు: కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు కోట్ల హర్షవర్ధన్ రెడ్డి మరియు కోడుమూరు నియోజకవర్గం వైయస్సార్సీపీ ఇంచార్జి డాక్టర్ ఆదిమూలపు సతీష్ ఆదేశాల మేరకు ఈ నెల 5వ తేదీ పోతిరెడ్డిపాడు వద్ద తలపెట్టిన బహిరంగ సభకు సంబంధించిన చలో పోతిరెడ్డిపాడు కార్యక్రమం పోస్టర్‌ను కోడుమూరు జడ్పిటిసి రఘునాథ్ రెడ్డి, మండల కన్వీనర్ రమేష్ నాయుడు మరియు పార్టీ నాయకులు ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ..రాయలసీమ ప్రాంత అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టులపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిన్న చూపు చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం కేవలం అమరావతి రాజధాని అభివృద్ధిపైనే దృష్టి సారిస్తోందని, రాయలసీమ ప్రాంతాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. రాయలసీమ రైతులకు అత్యంత కీలకమైన పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు పనులు పూర్తిగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు పనులు ఆగిపోయాయని చెప్పినా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున ఒక్క మంత్రి కూడా స్పందించకపోవడం దురదృష్టకరమని అన్నారు. రాయలసీమ ప్రయోజనాల విషయంలో సీఎం చంద్రబాబు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. పార్టీ శ్రేణులు భారీగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏఐటీయూసీ 21వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి...నాయకుల పిలుపు

- కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి..ఏఐటీయూసీ డిమాండ్.
- ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమం తప్పదు.
- ఈ నెల 12న సమ్మెతో ప్రభుత్వాలకు గుణపాఠం.





(ఆలూరు మనగళం): ఏఐటీయూసీ 21వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలనే లక్ష్యంతో ఆహ్వాన సంఘం సమావేశాన్ని మంగళవారం ఆలూరు పట్టణంలోని ఉమా కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్ బాబు, జిల్లా కార్యదర్శి మునెప్ప ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలకు ఉపాధి లేకుండా చేసే విధంగా ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నాయని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికుల హక్కులను హరించే విధంగా ఉన్నాయని విమర్శించారు. ఈ లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని, కార్మికులకు కనీస పనిదినాలు, వేతనాలు భరోసా ఇవ్వాలని కోరారు. వీబీ జీ రామ్ జీ పథకాన్ని వెంటనే రద్దు చేయాలని, విత్తన సవరణ చట్టం, విద్యుత్ సవరణ చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు నష్టాన్ని కలిగించే విధానాలను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని స్పష్టం చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌తో పాటు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయరాదని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న కార్మికులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగాన్ని కాపాడుకోవడం ప్రజలందరి బాధ్యత అని వారు పేర్కొన్నారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నబీ రసూల్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లెనిన్ బాబు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా విధానాలు తీసుకువస్తూ కార్మికులను శిక్షించేలా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఈ కార్మిక వ్యతిరేక విధానాలను వెంటనే రద్దు చేయకపోతే ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్న సమ్మె ద్వారా ప్రభుత్వాలకు గట్టి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూపేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు విరుపాక్షి, రాజా సహెబ్, ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కృష్ణ, ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజేనింగ్ కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా ఆటో వర్కర్స్ యూనియన్ ఈశ్వర్, ఏఐటీయూసీ తాలూకా అధ్యక్ష కార్యదర్శులు కృష్ణమూర్తి, రంగన్న, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఓబి నాగరాజ్, ఆశా వర్కర్ యూనియన్ జిల్లా కార్యదర్శి రమీృజ బి, అంగన్ వాడి జిల్లా కార్యదర్శి ప్రమీలమ్మ, రైతు సంఘం తాలూకా అధ్యక్షులు చంద్రకాంత్ రెడ్డి, ఎమ్మిగనూరు నియోజవర్గ కార్యదర్శి తిమ్మ గురుడు, హొలగుంద మండలం కార్యదర్శి మారెప్ప, దేవనకొండ మండలం కార్యదర్శి నరసరావు, ఏఐటీయూసీ, సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘానికి చెందిన జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బుధవారం
04 - 02 - 2026

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

## ప్రపంచ క్యాన్సర్ దినం - నిర్లక్ష్యం కాదు, నివారణే రక్షణ

ప్రపంచవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలను ప్రభావితం చేస్తున్న క్యాన్సర్ వ్యాధి గురించి మాట్లాడాల్సిన అవసరాన్ని గుర్తు చేసే రోజు ప్రపంచ క్యాన్సర్ దినం. ఆధునిక వైద్య శాస్త్రం ఎంతగా ముందుకు వెళ్లినా, అవగాహనలేమి, భయం, నిర్లక్ష్యం కారణంగా అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. క్యాన్సర్ అనేది ఒక్కరోజులో వచ్చిపడే వ్యాధి కాదు. జీవనశైలిలోని చిన్నచిన్న తప్పిదాలు, అలవాట్లు, పర్యావరణ ప్రభావాలు కాలక్రమేణా దీనికి దారితీస్తున్నాయి. అయినప్పటికీ, “నాకు కాదు” అనే నిర్లక్ష్య ధోరణి సమాజంలో బలంగా ఉండటమే అసలు సమస్య.

– ముందస్తు గుర్తింపే ప్రాణరక్షణ

క్యాన్సర్ విషయంలో ముందస్తు గుర్తింపు అత్యంత కీలకం. తొలి దశలో గుర్తిస్తే, చికిత్స విజయవంతం అయ్యే అవకాశాలు ఎంతో ఎక్కువ. సాధారణ స్క్రీనింగ్ పరీక్షలు, శరీరంలో కనిపించే చిన్న మార్పులను గమనించడం, అనుమానం వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించడం వంటి అలవాట్లు ప్రాణాలను కాపాడగలవు. కానీ, గ్రామీణ ప్రాంతాల్లోనే కాదు పట్టణాల్లో కూడా పరీక్షల పట్ల నిర్లక్ష్యం కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. వైద్య ఖర్చుల భయం, సమయం లేదన్న కారణాలు చివరికి ప్రాణాలకే ముప్పుగా మారుతున్నాయి.

– జీవనశైలే రోగానికి దారి?

తప్పు ఆహారపు అలవాట్లు, పొగాకు వినియోగం, మద్యపానం, వ్యాయామం లేకపోవడం, అధిక ఒత్తిడి ఇవన్నీ క్యాన్సర్‌కు దారితీసే ప్రధాన కారణాలుగా మారాయి. ఆధునిక జీవనశైలిలో వేగం పెరిగింది గానీ, ఆరోగ్యం వెనక్కి వెళ్లిపోయింది. ప్యాకెట్ ఆహారం, రసాయనాలతో నిండిన పదార్థాలు మన శరీరంపై మౌనంగా ప్రభావం చూపుతున్నాయి. క్యాన్సర్ నివారణ అంటే కేవలం ఆసుపత్రుల బాధ్యత కాదు; అది ప్రతి వ్యక్తి తన జీవనశైలిని సరిదిద్దుకోవడంలోనే మొదలవుతుంది.

– బాధితులకు మద్దతే నిజమైన మానవత్వం

క్యాన్సర్ బాధితులు శారీరకంగా మాత్రమే కాదు, మానసికంగా కూడా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటారు. చికిత్స సమయంలో కుటుంబం, సమాజం నుంచి లభించే మద్దతు వారికి కొత్త శక్తిని ఇస్తుంది. కానీ ఇంకా చాలా చోట్ల క్యాన్సర్ బాధితులను వేరుగా చూసే ధోరణి ఉంది. ఈ ముద్రను తొలగించాల్సిన బాధ్యత సమాజానిదే. వారికి అవసరమైనది సానుభూతి కాదు, అర్థం చేసుకునే మనసు, అండగా నిలిచే ధైర్యం.

– నివారణే నిజమైన విజయం

ప్రపంచ క్యాన్సర్ దినం ఒక గుర్తుచూపు మాత్రమే. ఏడాదిలో ఒకరోజు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మర్చిపోవడం సరిపోదు. నిర్లక్ష్యం కాదు నివారణే రక్షణ అనే సందేశాన్ని ప్రతి రోజు ఆచరణలో పెట్టాలి. ఆరోగ్యకరమైన జీవనశైలి, క్రమమైన వైద్య పరీక్షలు, భయాన్ని పక్కన పెట్టి నిజాన్ని ఎదుర్కొనే ధైర్యం -- ఇవే క్యాన్సర్‌పై మనం సాధించగల నిజమైన విజయం. ప్రతి వ్యక్తి తన ఆరోగ్యంపై బాధ్యత తీసుకున్న రోజే, క్యాన్సర్ వంటి వ్యాధులపై సమాజం నిజంగా గెలిచిన రోజు అవుతుంది. క్యాన్సర్ బాధితుడు శారీరకంగా మాత్రమే కాదు, మానసికంగా కూడా తీవ్రమైన పోరాటం చేస్తాడు. చికిత్స భయం, భవిష్యత్తుపై అనిశ్చితి, కుటుంబంపై పడే భారం అనే ఆలోచనలు వారిని లోపలినుంచి కుంగదీస్తాయి. ఇలాంటి సమయంలో కుటుంబం, సమాజం నుంచి వచ్చే మాటలు, ప్రవర్తనే కీలకం. దురదృష్టవశాత్తు, ఇంకా చాలా చోట్ల క్యాన్సర్‌ను అంటువ్యాధిలా చూసే మనస్తత్వం ఉంది. ఈ సామాజిక ముద్ర బాధితుడి బాధను రెట్టింపు చేస్తోంది. ప్రభుత్వాలు, వ్యవస్థల బాధ్యత క్యాన్సర్ నివారణలో ప్రభుత్వాల పాత్ర కీలకం. అవగాహన కార్యక్రమాలు, ఉచిత స్క్రీనింగ్ శిబిరాలు, గ్రామస్థాయిలో ఆరోగ్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం అత్యవసరం. చికిత్స ఖర్చులు కుటుంబాలను అప్పుల పాల్జేసే స్థితి మారాలి. ఆరోగ్యం విలాసం కాదు, మౌలిక హక్కు అనే భావన వ్యవస్థలో బలపడాలి. అదే సమయంలో ప్రజలు కూడా తమ బాధ్యతను మరిచిపోవద్దు. ప్రభుత్వం చేస్తుందన్న నమ్మకంతో చేతులు ముడుచుకుని కూర్చోవడం ప్రమాదకరం. నివారణ మన చేతుల్లో ఉన్న పరిష్కారం క్యాన్సర్‌పై పూర్తి విజయం సాధించడం కష్టమే కావచ్చు. కానీ నివారణ ద్వారా ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. ఆరోగ్యకరమైన ఆహారం, క్రమమైన వ్యాయామం, చెడు అలవాట్లకు దూరం, మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ, అవసరమైనప్పుడు వైద్య పరీక్షలు ఇవన్నీ మన చేతుల్లో ఉన్న పరిష్కారాలే. ఒకరోజు ప్రపంచ క్యాన్సర్ దినం పాటించడం కాదు, ప్రతి రోజూ ఆరోగ్యాన్ని గౌరవించడమే అసలైన నివాళి. ఒక రోజు కాదు  ఒక ఉద్యమం కావాలి ప్రపంచ క్యాన్సర్ దినం ఒక తేదీ మాత్రమే కాదు, ఒక ఆలోచన. నిర్లక్ష్యం కాదు నివారణే రక్షణ అనే సందేశం గోడలపై నినాదంగా ఉండకూడదు; మన జీవితాల్లో ఆచరణగా మారాలి. ప్రతి కుటుంబం, ప్రతి వ్యక్తి ఈ పోరాటంలో భాగస్వామి కావాలి. క్యాన్సర్‌పై పోరాటం వైద్యులదే కాదు, సమాజం మొత్తానిదే. ఆరోగ్యాన్ని విలువైనదిగా భావించిన రోజే, క్యాన్సర్ వంటి వ్యాధులపై మనం నిజంగా గెలిచిన రోజు అవుతుంది.

# ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలి....

- ప్రభుత్వ శాఖల సమన్వయంతో శివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి....
- భక్తులు ఇతరులకు ఆటంకం లేకుండా పోలీసు వారి సూచనలను పాటిస్తూ తమ వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని విజ్ఞప్తి...
- జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్ గారు.

మనగళం శ్రీశైలం : నంద్యాల జిల్లా శ్రీశైలం నందు జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారిని దర్శనం నిమిత్తం వచ్చే భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకొని వారికి ఎలాంటి ఆటంకాలు, అవాంఛనీయ సంఘటనలు ట్రాఫిక్  సమస్య తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్ IPS గారు పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు సంబంధిత పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించడం జరిగింది .అనంతరం శ్రీశైలం నందు భక్తులకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా తీసుకునే చర్యలలో భాగంగా శ్రీశైలం నందు గల పార్కింగ్ ప్రదేశాలను అనగా రింగ్ రోడ్డు వద్ద గల పార్కింగ్ ప్రదేశాలను, =ుజబస్టాండ్, సాక్షి గణపతి, హటకేశ్వరం ,సుండిపెంట గ్రామం నందు లింగాల గట్టు మొదలగుప్రదేశాలలో స్వయంగా పర్యటించి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, మరియు లింగాలగట్టు స్నానఘాట్ లను కూడా పరిశీలించి సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేయడం జరిగింది.  ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారి దర్శనం నిమిత్తం విచ్చేయు భక్తులు పోలీసు వారి సూచనలను పాటిస్తూ తమ వాహనాలను






ఇతరులకు ఆటంకం లేకుండా పార్కింగ్ చేసుకోవాలని,రోడ్డుకు ఇరువైపులా ఎట్టి పరిస్థితుల్లో పార్కింగ్ చేయరాదని విజ్ఞప్తి చేశారు.

# శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారికి విశేష అభిషేకం

మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు  ( 03.02.2026) ఉదయం ఆలయప్రాంగణంలోని శ్రీసుబ్రహ్మణ్యస్వామి (కుమారస్వామి) వారికి విశేష పూజలను నిర్వహించడం జరిగింది. ప్రతి మంగళవారం మరియు కృత్తికానక్షత్రం, షష్ఠి తిథి రోజులలో శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వారికి ఈ విశేషఅభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) నిర్వహించబడుతున్నాయి. కుమారస్వామివారికి పూజలు జరపడం వలన లోకకల్యాణమే కాకుండా ప్రతి ఒక్కరికి ఉద్యోగ, వ్యాపార, వ్యవహారాలలో ఆటుపోట్లు తొలగి ఆయా పనులు సక్రమంగా జరుగుతాయి. సుబ్రహ్మణ్యస్వామి అనుగ్రహంతో శత్రుబాధలు, గ్రహపీడలు, దృష్టి దోషాలు మొదలైనవి తొలగిపోతాయి. అలాగే సంతానం కోసం పూజించేవారికి తప్పక సంతానభాగ్యం లభిస్తుందని చెప్పబడుతోంది. ఈ అభిషేకానికి ముందుగా దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతివైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతిపూజ జరిపించబడింది.  అనంతరం శ్రీసుబ్రహ్మణ్యస్వామివారికి అభిషేకము, అర్చన తరువాత సుబ్రహ్మణ్యస్తోత్ర పారాయణలు చేయబడ్డాయి.  సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలైన పాలు,పెరుగు,తేనె,నెయ్యి, కొబ్బరి నీళ్ళు మరియు వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా వివిధ పండ్ల రసాలతో చేసే అభిషేకంతో ఎంతో ఫలితం ఉంటుందని ఆగమాలు చెబుతున్నాయి.



# నందీశ్వరస్వామికి విశేషపూజ




మనగళం శ్రీశైలం : లోక కల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు ( 03.02.2026) ఆలయప్రాంగణంలోని  నందీశ్వర స్వామికి (శనగల బసవన్న స్వామివారికి) విశేషార్చనలను నిర్వహించనున్నది. ప్రతి మంగళవారం మరియు త్రయోదశి రోజున దేవస్థానసేవగా (సర్కారీసేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది. ప్రదోషకాలంలో అనగా సాయంసంధ్యాసమయంలో ఈ విశేషపూజలు నిర్వహించడం జరుగుతోంది. ఈ విశేషార్చనలో ముందుగా లోకక్షేమాన్ని కాంక్షిస్తూ దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరిత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు, వేదపండితులు సంకల్పాన్ని చెప్పడం జరుగుతుంది. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకుమహాగణపతిపూజను జరిపించబడుతుంది. ఆ తరువాత నందీశ్వర స్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలతోనూ, ఫలోదకాలతో హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, భస్మోదకం, రుద్రాక్షోదకం, బిల్వోదకం, పుష్పోదకం, సువర్ణోదకం మరియు మల్లికా గుండంలోని శుద్ధజలంతో అభిషేకం నిర్వహిస్తారు. తరువాత నందీశ్వరస్వామికి అన్నాభిషేకం నిర్వహించబడుతుంది. వృషభసూక్తం మొదలైన వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా ఈ విశేషాభిషేకాన్ని చేయడం జరుగుతుంది. తరువాత నందీశ్వర స్వామి వారికి నూతనవస్త్ర సమర్పణ, విశేషపుష్పార్చనలను చేస్తారు. అనంతరం నానబెట్టిన శనగలను నందీశ్వరస్వామికి సమర్పించడం జరుగుతుంది. చివరగా స్వామికి నివేదన సమర్పించబడుతుంది.


# క్యూలైన్లను పరిశీలిస్తున్న దేవదాయ శాఖ కమిషనర్ తదితరులు

మనగళం శ్రీశైలం : 02.02.2026 క్యూలైన్లను పరిశీలిస్తున్న దేవదాయ శాఖ కమిషనర్ శ్రీ రామచంద్ర మోహన్ మరియు జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి, జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్, ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంట రమేష్ నాయుడు, కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు వీడియోలు





## బయలు వీరభద్రస్వామికి ప్రదోషకాల అభిషేకం



మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (03.02.2026) సాయంకాలం శ్రీశైలక్షేత్ర పాలకుడైన శ్రీబయలు వీరభద్రస్వామివారికి విశేషపూజలను జరిపించనున్నది.ప్రతీ మంగళవారం మరియు అమావాస్యరోజులలో బయలు వీర భద్ర స్వామి వారికి ఈ విశేష అభిషేకం, అర్చనలను నిర్వహించబడుతున్నాయి. బయలువీరభద్రస్వామివారు శివభక్తగణాలకు అధిపతి. అదేవిధంగా శ్రీశైలక్షేత్రపాలకుడుగా క్షేత్రానికి ఆరుబయట ఉండి, ఎటువంటి ఆచ్ఛాదన, ఆలయం లేకుండగా బయలుగా దర్శనమిస్తాడు కనుక ఆయనకు బయలువీరభద్రస్వామి అని పేరు వచ్చింది. ప్రసన్నవదనంతో కిరీట మకుటాన్ని కలిగి దశభుజుడైన స్వామివారు పది చేతులలో వివిధ ఆయుధాలతో దర్శనమిస్తాడు. స్వామివారికి క్రిందివైపున కుడివైపు దక్షుడు, ఎడమవైపు భద్రకాళి దర్శనమిస్తారు. ఈ స్వామిని దర్శించినంత మాత్రానే ఎంతటి క్లిష్ట సమస్యలైనా తొలగిపోతాయని, వ్యాధులు నశించి ఆయురారోగ్యాలు చేకూరుతాయని ప్రసిద్ధి. ముఖ్యంగా ఆగమసంప్రదాయంలో క్షేత్రపాలక పూజకు చాలా విశేషస్థానం ఉంది. క్షేత్ర పాలకుడికి పూజలు చేయడం వలన ఆ క్షేత్రంలో ఉన్నటువంటి భక్తులు ఎటువంటి భయం,బాధలు లేకుండా సుఖసంతోషాలతో ఉంటారు. మంగళవారం, ఆదివారం మరియు అమావాస్య రోజులలో చేసే వీరభద్రపూజ అనేక ఫలితాలు ఇస్తుందని ఆగమశాస్త్రాలు చెబుతున్నాయి. ఈ స్వామిపూజతో సకలగ్రహ అరిష్టదోషాలు, దుష్టగ్రహపీడలు తొలగిపోతాయి. అదేవిధంగా సంతానం, ఐశ్వర్యం మొదలైన అనేక శుభఫలితాలు చేకూరుతాయి. ఈ పూజాదికాలలో పంచామృతాలతోనూ, బిల్వోదకం, కుంకుమోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించడం జరుగుతుంది.

## మన ఊరు మన జాతర అలరించిన పొట్టేలు పోటీలు





మన గళం కోడుమూరు: శ్రీ చౌడేశ్వరి దేవి తిరునాల సందర్భంగా మన ఊరు మన జాతర లో భాగంగా పొట్టేలు పందేలు ప్రారంభమయ్యాయి. కోడుమూరు ఎం. ఎల్ ఎ బొగ్గుల దస్తగిరి ఈ పోటీలను ప్రారంభించారు. మొత్తం 22 పొట్టేలు పోటీలకు తలపడ్డాయి. ఈ కార్యక్రమానికి విష్ణుసేన దాతగా ఉన్నారు. మొదటి బహుమతి 20 వేలు, రెండవ బహుమతి 10 వేలు, మూడవ బహుమతి 5 వేలు విజేతలకు అందిస్తారు. ఈ పోటీల్లో నంద్యాలకు చెందిన రాక్షస టీమ్ కు మొదటి బహుమతి, సై రా టీమ్, భైరవ టీమ్ మూడవ స్థానం సాధించాయి. ఈ పోటీలకు ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుండి జట్లు వచ్చాయి

# నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలి

- అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలి.
- ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలనీ పిలుపునిచ్చారు.
- ఆలూరు ఏఐసీసీటు, ఐఎఫ్టియు నాయకులు.



(ఆలూరు మనగళం): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి కార్మికుల ఓట్లు కావాలి, కార్మిక శ్రేయస్సు గాలికి వదిలేసిందా..?

అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ లేబర్ కోడ్ల రద్దు కోసం ఫిబ్రవరి 12 న కేంద్ర కార్మిక సంఘాలు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన దేశవ్యాపిత సార్వత్రిక సమ్మెలో దేశవ్యాపిత సమ్మె గెస్ట్ హౌస్ పోస్టర్లు విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏఐసీసీటు, ఐఎఫ్టియు ఆలూరునియోజకవర్గ కార్యదర్శి బోయ మునిస్వామి సవరప్ప మునిస్వామి రైతు కూలి సంఘం ఈరన్న వైయస్సార్సీపి తిక్క స్వామిమాట్లాడుతూ దేశంలో పేద కార్మిక, రైతాంగ ఓట్లతో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతాంగ, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ, కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని వారు ఆరోపించారు. బ్రిటీష్ కాలంలో అనేక పోరాటాలు, త్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాల స్థానంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలు మార్చింది. కార్మిక, రైతు హక్కులను కాలరాస్తోందన్నారు. నాలుగు లేబర్ కోడ్ల అమలు ద్వారా దేశంలో కార్మిక వర్గానికి రావాల్సిన అనేక మౌలిక సదుపాయాలు, కనీస వేతనాలు, యూనియన్ రిజిస్ట్రేషన్లు అందే పరిస్థితి లేదన్నారు. కార్మికులు ప్రశ్నించే తత్వాన్ని కోల్పోయే ప్రమాదకర చట్టాలను ఈ ప్రభుత్వం తీసుకొస్తుందని, మాట్లాడే స్వేచ్ఛను హరిస్తోందన్నారు. వీటిని తిప్పి కొట్టేందుకే కార్మిక సంఘాలు ఐక్య పోరాటాలు నిర్వహించాలని కోరారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కోట్లాదిమంది కార్మికులకు రావాల్సిన సంక్షేమ బోర్డు నిధులు ఇంతవరకు అందలేదని విమర్శించారు. స్కీమ్ వర్కర్లు అయిన ఆశా, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు కనీస వేతనశీ ఇవ్వాలి. కనేత వేతన చట్టం అమలు చేయాలి. మోదీ సర్కార్ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందన్నారు. ఎనిమిది గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచింది. ఇది కార్మిక వ్యతిరేక ప్రభుత్వమని విమర్శించారు. ఈ తరుణంలో కోట్లాది మంది కార్మికులు ఫిబ్రవరి 12న చేపట్టే సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలని కోరారు. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల సందర్భంగా లేబర్ కోడ్లు, పని గంటలకు వ్యతిరేకంగా, కనీస వేతన బోర్డు, భవన కార్మిక సంక్షేమ బోర్డు కోసం అసెంబ్లీలో కూటమి ప్రభుత్వం తీర్మానం చేయాలి. రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించలి. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయకూడదు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు వీరేష్, పుచ్చప్ప, వీరన్న, పరశురాముడు, తదితరులు పాల్గొన్నారు.

# ఆమడగుంట్ల గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం





మన గళం కోడుమూరు: మడగుంట్ల గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించబడినది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారితో పాటు ఏఈఓ బాలకృష్ణ ఆర్ఎ స్కే సిబ్బంది బజారి మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుత ప్రతి రైతు మట్టి పరీక్ష చేయించుకోవాలి అలాగే మండలంలోని రైతులందరూ కూడా రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించి పంట నమోదు చేయించుకోవాలి ఇందులో భాగంగా రైతు విశిష్ట సంఖ్యను రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి పొందవలెనని ఈ సందర్భంగా వారు రైతులకు తెలియజేశారు మరీ లోతు దుప్పులు కాకుండా వాలుకు అడ్డంగా దుక్కులు చేసుకోవలెన అలాగే పీఎం కిసాన్ డబ్బులు పడని రైతులు రైతు సేవ కేంద్రం సిబ్బందిని ఆయా గ్రామాల వారినిసంప్రదించాలని ఈ సందర్భంగా వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికార సిబ్బంది మరియు స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు

# వికలాంగుల గురించి పట్టించుకోని టీడీపీ కోటేశ్వరరావు

**దివ్యాంగుల సంఘం వైకాపా జిల్లా అధ్యక్షుడు మొలగవెల్లి రామాంజనేయులు.**



(ఆలూరు మనగళం): తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి రెండు నెలలు అవుతున్న దివ్యాంగుల గురించి పట్టించుకోలేకపోవడం చాలా దారుణమని దివ్యాంగుల సంఘం వైకాపా జిల్లా అధ్యక్షుడు మొలగవెల్లి రామాంజనేయులు అన్నారు మంగళవారం ఆలూరు లోనే ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్ పొందుతున్న వికలాంగుల కు సంబంధించి చాలా మంది పింఛన్లు తొలగించారని ఆరోపించారు. దీనిపై తెదేపా పార్టీ మాజీ కార్పొరేషన్ చైర్మన్ దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు కోటేశ్వరరావు నోరు ఎత్తకపోవడం దారుణం అన్నారు. అధికారంలోకి రాకముందు ఎన్నో హామీలు ఇచ్చిన సీఎం చంద్రబాబు నాయుడు గద్దెనెక్కిన తర్వాత హామీలను తుంగలో తొక్కారని విమర్శించారు. ఇప్పటికైనా దీనిపై తెలుగుదేశం పార్టీ దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు కోటేశ్వరరావు సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో రాబోయే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీకి బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. మండల దివ్యాంగుల మండల అధ్యక్షుడు మల్లికార్జున్ నాయక్ పాల్గొన్నారు

# అంబటి రాంబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ కేడీసీసీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి



మన గళం కర్నూలు: ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారిపై అంబటి రాంబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ కేడీసీసీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి , ఇంటి పరిధిలో నిర్వహించిన వైసీపీ పార్టీ మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలపై

ఈ సందర్భంగా డి.విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూలి, ప్రజల చేత ఎన్నుకోబడిన ముఖ్యమంత్రిపై అసభ్యకరమైన పదజాలంతో , బాధ్యతారాహిత్య వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్టను దిగజార్చేలా మాట్లాడటం తగదని మండిపడ్డారు. ఇటువంటి వ్యాఖ్యలను ప్రజలు ఏమాత్రం సహించరని స్పష్టం చేశారు అంబటి రాంబాబు తన వ్యాఖ్యలకు వెంటనే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ, ప్రజల మనోభావాలను గౌరవించి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హెచ్చరించారు. రాష్ట్రంలో తిరుమల లడ్డు కల్తీ నెయ్యి కేసులో దోషులుగా వైసీపీ పార్టీ నాయకులు అడ్డంగా దొరికి వారు చేసిన పాపాలు బయట పడినందుదకు దీని నుండి డైవర్షన్ రాజకీయాలు చేస్తూ ఇటువంటి పన్నాగాలు పన్నుతున్నారని అన్నారు.రాష్ట్రంలో శాంతి భద్రతలు, ప్రజాస్వామ్య విలువలు కాపాడాలంటే ఇటువంటి నీచ నాయకులను కట్టడి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని అంబటి రాంబాబు వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# అల్లు అర్జున్‌తో 'ధురంధర్' దర్శకుడు భారీ ప్రాజెక్ట్..

**- ఐకాన్ స్టార్ గ్రీన్ సిగ్నల్ ఇస్తాడా..!**



ముంబయి , 03 ఫిబ్రవరి 2026 , మన గళం : బాలీవుడ్‌లో 'ఉరి', 'ధురంధర్' వంటి భారీ విజయాలతో దర్శకుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆదిత్య ధర్ తన తదుపరి చిత్రాన్ని ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌తో చేయాలని భావిస్తున్నట్లు సినీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. 'ధురంధర్' విజయం తర్వాత తన కలల ప్రాజెక్ట్ కథను ఆదిత్య ధర్ ఇటీవల అల్లు అర్జున్‌కు వివరించినట్లు, దీనిపై బన్నీ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.ఈ ప్రాజెక్ట్ ప్రస్తుతం చర్చల దశలో మాత్రమే ఉందని, 2026 మార్చిలో 'ధురంధర్' రెండో భాగం విడుదలైన తర్వాతే దీనిపై స్పష్టత వచ్చే అవకాశముందని తెలుస్తోంది. బాలీవుడ్ మీడియా కూడా ఈ కాంబినేషన్‌పై ఆసక్తికర కథనాలు ప్రచురిస్తోంది. ఒకవైపు దర్శకుడి స్టైల్, మరోవైపు అల్లు అర్జున్ గ్లోబల్ ఇమేజ్ కలిసి వస్తే భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత భారీ యాక్షన్ డ్రామాగా ఈ చిత్రం నిలిచే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు. అయితే ఈ వార్తలపై చిత్ర బృందం స్పందిస్తూ, ప్రస్తుతం ఇవన్నీ కేవలం పుకార్లేనని, అధికారికంగా ఎలాంటి ఒప్పందం కుదరలేదని స్పష్టం చేసింది. అయినప్పటికీ ఈ క్రేజీ కాంబినేషన్ నిజమైతే బాక్సాఫీస్ రికార్డులు తిరగరాయడం ఖాయమని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ధనుష్‌తో మరోసారి జతకడుతున్న సాయిపల్లవి..

చెన్నై ,03 ఫిబ్రవరి 2026 ,మన గళం : కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్, నేచురల్ బ్యూటీ సాయిపల్లవి కాంబినేషన్ అంటే ప్రేక్షకులకు వెంటనే గుర్తొచ్చేది 'మారి 2' చిత్రంలోని రౌడీ బేబీ పాట. ఆ పాటతో పాటు ఇద్దరి మధ్య కనిపించిన కెమిస్ట్రీ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ఇప్పుడు దాదాపు ఆరేళ్ల విరామం తర్వాత ఈ క్రేజీ జోడీ మరోసారి వెండితెరపై కలిసి కనిపించబోతున్నట్లు సమాచారం.

ధనుష్ కెరీర్‌లో 55వ చిత్రంగా తెరకెక్కుతున్న తాజా సినిమాలో సాయిపల్లవి హీరోయిన్‌గా ఎంపికైనట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రంలో ఇప్పటికే శ్రీలీలను ఒక కథానాయికగా తీసుకోగా, మరో కీలక మహిళా పాత్ర కోసం సాయిపల్లవిని సంప్రదించగా ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది.

ఈ సినిమాకు అమరన్ చిత్రంతో సూపర్ హిట్ అందుకున్న రాజ్ కుమార్ పెరియాస్వామి దర్శకత్వం వహించనున్నాడు. కథ, పాత్ర ప్రాధాన్యాన్ని బట్టి సాయిపల్లవి ఈ సినిమాకు ఒప్పుకున్నట్లు టాక్ వినిపిస్తోంది. వండర్‌బార్ ఫిల్మ్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మించనుండగా, త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశముందని సమాచారం. ధనుష్, సాయిపల్లవి కాంబో మళ్లీ రిపీట్ కావడంతో అభిమానుల్లో ఇప్పటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి.



# అందానికే అసూయ పుడుతుందేమో.. లంగావోణీలో భాగ్యశ్రీ!

హైదరాబాద్ ,03 ఫిబ్రవరి , మన గళం : అందాల ముద్దుగుమ్మ భాగ్యశ్రీ బోర్సే తన తాజా లంగావోణీ ఫొటోలతో సోషల్ మీడియాలో సందడి చేస్తోంది. సహజమైన చిరునవ్వు, సొగసైన లుక్‌తో ఆమె షేర్ చేసిన చిత్రాలు క్షణాల్లోనే నెట్టింట వైరల్‌గా మారాయి. సంప్రదాయ వేషధారణలో భాగ్యశ్రీ చూపించిన అందం అభిమానులను మంత్రముగ్ధులను చేస్తోంది. తెలుగులో మిస్టర్ బచ్చన్ చిత్రంతో తెరంగేట్రం చేసిన భాగ్యశ్రీ, తొలి సినిమా ఫలితం ఆశించిన స్థాయిలో లేకపోయినా తన గ్లామర్, నటనతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. అనంతరం ఆంధ్రా కింగ్ తాలూకా చిత్రంలో నటించి మెప్పించినా, అది కూడా హిట్ ఇవ్వలేకపోయింది. అయినప్పటికీ అవకాశాల విషయంలో ఆమె వెనక్కి తగ్గకుండా వరుస ప్రాజెక్టులతో ముందుకెళ్తోంది. ప్రస్తుతం విజయ్ దేవరకొండ సరసన కింగ్ డమ్ చిత్రంలో నటిస్తూ బిజీగా ఉన్న భాగ్యశ్రీ, దుల్కర్ సల్మాన్, రానాతో కలిసి కూడా సినిమాలు చేస్తోంది. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో పలు చిత్రాలతో ఫుల్ షెడ్యూల్‌లో ఉన్న ఈ బ్యూటీ, సోషల్ మీడియాలోనూ ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండి తన క్యూట్, గ్లామర్ ఫొటోలతో అభిమానులను ఆకట్టుకుంటోంది. తాజాగా లంగావోణీలో మెరిసిపోయిన భాగ్యశ్రీ అందం చూసి నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. సంప్రదాయ వేషంలోనూ గ్లామర్‌కు ఏమాత్రం తగ్గకుండా కనిపించడంతో ఆమె ఫొటోలు మరింత హైలైట్‌గా మారాయి. అభిమానులు ఈ ఫొటోలపై లైక్స్, కామెంట్స్‌తో ప్రేమను చూపిస్తున్నారు.



# ఫిబ్రవరి 11 నుంచి ఓటీటీలోకి మన శంకర వరప్రసాద్ గారు



హైదరాబాద్ , 03 ఫిబ్రవరి , మన గళం : ఈ ఏడాది సంక్రాంతికి థియేటర్లలో విడుదలై ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్న మన శంకర వరప్రసాద్ గారు చిత్రం త్వరలో ఓటీటీలోకి రానుంది. మెగాస్టార్ చిరంజీవి హీరోగా, అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా మాస్, కామెడీ, కుటుంబ భావోద్వేగాల మేళవింపుతో భారీ విజయాన్ని సాధించింది. జనవరి 12న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించింది. ఇప్పటివరకు ఈ సినిమా వసూళ్లు 400 కోట్ల మార్క్‌ను దాటినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి.

థియేటర్లలో మూడు వారాలు పూర్తయినా కూడా ఈ సినిమా కలెక్షన్లలో తగ్గుదల కనిపించలేదని సమాచారం. చిరంజీవి కామెడీ టైమింగ్, ఫ్యామిలీ ఎమోషన్స్ ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. ఈ చిత్రంలో నయనతార హీరోయిన్‌గా నటించగా, అతిథి పాత్రలో విక్టరీ వెంకటేశ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సాహు గారపాటి, సుష్మిత కొణిదెల ఈ చిత్రాన్ని నిర్మించారు.

ఇప్పటికే ఈ సినిమా డిజిటల్ హక్కులు ప్రముఖ ఓటీటీ వేదిక సొంతం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 11 నుంచి ఓటీటీలో స్ట్రీమింగ్ ప్రారంభం కానుందని సమాచారం. అయితే దీనిపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. థియేటర్లలో ఫుల్ లెంగ్త్ వినోదం అందించిన ఈ సినిమా, ఓటీటీ ప్రేక్షకుల నుంచి కూడా మంచి స్పందన పొందుతుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

# మరో మాస్ కాంబోకి సిద్ధమైన బాలయ్య..

హైదరాబాద్ ,03 ఫిబ్రవరి , మన గళం : నట సింహం నందమూరి బాలకృష్ణ అంటే పవర్‌ఫుల్ పాత్రలు, మాస్ డైలాగులు, హై వోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులకు వెంటనే గుర్తుకొస్తాయి. అఖండ, వీరసింహారెడ్డి, భగవంత్ కేసరి, డాకు మహారాజ్ వంటి చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాలు సాధించిన బాలయ్య, ఇటీవల విడుదలైన అఖండ 2 విషయంలో మాత్రం కథ పరంగా అభిమానుల అంచనాలను పూర్తిగా అందుకోలేకపోయినట్లు చర్చ సాగుతోంది. అయినప్పటికీ ఈ సినిమా 100 కోట్ల మార్క్‌ను దాటడం ద్వారా బాలకృష్ణ స్టార్ పవర్‌ను మరోసారి నిరూపించింది.

ప్రస్తుతం బాలకృష్ణ దర్శకుడు గోపీచంద్ మలినేనితో ఓ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌పై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. మొదట అనుకున్న కథను పక్కనపెట్టి, మరింత కమర్షియల్ ఎలిమెంట్స్‌తో కూడిన కొత్త కథతో సినిమా రూపొందుతున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. బాలయ్య ఇమేజ్‌కు తగ్గట్టుగా భారీ యాక్షన్ ఎపిసోడ్లు, ఎలివేషన్ సన్నివేశాలు ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని సమాచారం.

ఇదే సమయంలో బాలకృష్ణ మరో భారీ ప్రాజెక్ట్‌కు సిద్ధమవుతున్నారనే వార్తలు ఫిల్మ్ నగర్‌లో హల్‌చల్ చేస్తున్నాయి. మలయాళ సినీ పరిశ్రమకు చెందిన స్టైలిష్ యాక్షన్ దర్శకుడు హనీఫ్ అదెనితో బాలయ్య ఓ పాన్ ఇండియా స్థాయి సినిమా చేయనున్నారనే టాక్ జోరుగా వినిపిస్తోంది. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత దిల్ రాజు నిర్మించనున్నారని సమాచారం. అధికారిక ప్రకటన ఇంకా రాకపోయినా, ఈ కాంబినేషన్ వార్తలతోనే బాలయ్య అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి.



హనీఫ్ అదెని సినిమాలు రా ఎనర్జీ, ఇంటెన్స్ యాక్షన్, స్టైలిష్ విజువల్స్‌కు కేరాఫ్‌గా నిలుస్తాయి. ఇటీవల విడుదలైన మార్కో సినిమాతో దక్షిణాది ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన ఆయన, టార్గెటెడ్ మాస్ ఆడియెన్స్‌ను బాగా మెప్పించారు. ఇలాంటి టేకింగ్ స్టైల్ బాలకృష్ణ మాస్ ఇమేజ్‌కు మరింత బలాన్నిస్తుందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ వార్తలపై స్పష్టత రావాలంటే మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది

# వాడు నడుము గిల్లితే ఊరుకోలేదు..ఒక్కటిచ్చా..



హైదరాబాద్ , 03 ఫిబ్రవరి, మన గళం : నటి దివి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తనకు ఎదురైన చేదు అనుభవాన్ని బహిరంగంగా పంచుకున్నారు. పబ్‌లో జరిగిన ఓ ఈవెంట్‌కు అతిథిగా హాజరైన సమయంలో తన అనుమతి లేకుండా ఓ వ్యక్తి నడుము గిల్లాడని ఆమె తెలిపారు. చుట్టూ బాడీగార్డులు ఉన్నప్పటికీ ఈ ఘటన జరగడం షాక్‌కు గురిచేసిందని చెప్పారు. అయితే ఆ సమయంలో తాను ఏమాత్రం భయపడలేదని, వెంటనే ఆ వ్యక్తిని బాడకోవ్ అని తిట్టి ఒక్కటిచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయానని స్పష్టం చేశారు. అలా స్పందించినందుకు తనకు ఎలాంటి పశ్చాత్తాపం లేదని, ఊరుకుని ఉంటేనే తనకు బాధగా ఉండేదని దివి అన్నారు.ఈ ఘటన తన దుస్తుల వల్ల కాదని ఆమె స్పష్టంగా చెప్పారు. ఆ రోజు తాను సాదాసీదా టీషర్ట్‌లోనే ఉన్నానని, మహిళ ఏం వేసుకున్నా అంగీకారం లేకుండా తాకే హక్కు ఎవరికీ లేదని కుండబద్దలు కొట్టారు. దుస్తుల ఎంపిక అనేది పూర్తిగా వ్యక్తిగత విషయం అని, ముందుగా మనకు సౌకర్యంగా ఉండేదే ధరించాలన్నారు. మనకు అసౌకర్యంగా అనిపించే దుస్తులు వేసుకోవాల్సిన అవసరం లేదని, అలాగే ఇతరులు ఏం ధరించారన్నది చూసి అసహనం వ్యక్తం చేయడం తప్పని దివి అభిప్రాయపడ్డారు.ఇతరుల దుస్తులు చూసి కొందరు ట్రిగ్గర్ అవుతారన్న మాటలను ఆమె తీవ్రంగా ఖండించారు. అలా అనిపిస్తే చూడకుండా ఉండాలని, అది మన సమస్య తప్ప ఎదుటివారి తప్పు కాదని చెప్పారు. చిన్నప్పటి నుంచే పిల్లలకు సరైన అవగాహన, విలువలు నేర్పించాలని, బయటి ప్రపంచం గురించి దాచకుండా నిజాలు తెలియజేయాలని దివి సూచించారు. మహిళల పట్ల గౌరవం, వ్యక్తిగత గోప్యతను సమాజం గౌరవించాల్సిన అవసరం ఉందని ఆమె వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# ఆశాలను కార్మికులుగా గుర్తించి కనీసం వేతనం 26 వేలు ఇవ్వాలని కార్మిక సంఘాల డిమాండ్





మన గళం గూడూరు: ఆశాలను కార్మికులుగా గుర్తించి కనీసం వేతనం 26 వేలు ఇవ్వాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కార్మికులందరికీ చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలనే డిమాండ్స్ సాధనకై కేంద్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు 2026 ఫిబ్రవరి 12న జరుగుతున్న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెలో ఆశా కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు మండలకార్యదర్శి జి గుంటప్ప, ఆశ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు మాధవి, శేషమ్మలు పిలుపునిచ్చారు ఈ సందర్భంగా ఫిబ్రవరి 12వ తేదీ జరిగే దేశవ్యాప్త సమ్మెలో ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారం కొరకు ఆశా వర్కర్లు కూడా ఒకరోజు సమ్మెలోకి వెళుతున్నట్లు గూడూరు( ాఎఇ) ప్రభుత్వ వైద్యశాలలలో ఆశ వర్కర్లు సమ్మె నోటీసును మెడికల్ ఆఫీసర్ కు ఇవ్వడం జరిగింది, ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి జి, గుంటప్ప,ఆశా వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు మాధవి, శేషమ్మలు మాట్లాడుతూ కార్మికలను యజమానులకు కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్ ను వెంటనే రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలు పరిరక్షించాలని, కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనం కోసం లేబర్ కోడ్ లను తెచ్చి, పని గంటలు 8 నుండి 12 గంటల పెంచిందని, లేబర్ కోడ్ వలన కార్మికులకు ఉన్న కనీస హక్కులు లేకుండా చేసి బానిసలను చేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తున్నదని, వెంటనే లేబర్ కార్డులను రద్దు చేయాలని, ఆశలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం 26 వేలు చెల్లించాలని, ఆశాలకు చట్టబద్ధమైన సౌకర్యాలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఆశా కార్మికులు గత 20 సంవత్సరాలుగా పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారని, ప్రభుత్వాలు వీరు సేవలను గుర్తించి కార్మికులుగా గుర్తించడం లేదని, ఆశాలు అనారోగ్యం పాలైన కుటుంబంలో ఎవరికైనా అనారోగ్యం చేసిన ఆశాలకు సెలవులు ఇచ్చే పరిస్థితి లేదని, 24 గంటలు డ్యూటీ చేయాల్సిన పరిస్థితి వచ్చింద ని, ప్రజలకు మోటివేట్ చేస్తే చాలు అనే పేరుతో నియమించిన ఆశా వర్కర్ ను నేడు అన్ని రకాలైనటువంటి పనులు ఊపిరి సలపకుండా చేయాల్సి వస్తున్నదని, కరోనా సమయంలో కరోనా బారిన ప్రజలను తమ ప్రాణాలకు తెగించి వైద్య సేవలు అందించడంలో కృషి చేశారని, అటువంటి ఆశా వర్కర్లను నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వారి సేవలను గుర్తించకుండా వారితో వెట్టి చాకిరి చేస్తున్నాయని, అందుకే ఆశా వర్కర్లను కార్మికులుగా గుర్తించి, కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని,ఆశాలు అన్ని రకాల సెలవులు ఇచ్చి, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని, ఆశా వర్కర్ కు 10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ఏఎన్ఎం, జిఎన్ఎమ్ శిక్షణ తీసుకున్న ఆశ వర్కర్లకు పర్మినెంట్ పోస్టుల భర్తీలో ప్రాధాన్యత ఇవ్వాలని,లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, తదితర డిమాండ్ల సాధనకై 12వ తేదీన జరిగే దేశాన్ని ఆశా వర్కర్లందరూ పాల్గొని సమ్మెను జయప్రదం చేయవలసిందిగా వారు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు ముని రా భాను, ఆదిలక్ష్మి, గిరిజ, వరలక్ష్మి, పర్వీన్, అరిఫా బి, సావిత్రి, కళావతి, పద్మ, మరియు ఆశ వర్కర్లు పాల్గొన్నారు

## టీ20 ప్రపంచ కప్ 2026..



ముంబై , 03 ఫిబ్రవరి 2026, మన గళం : ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభం కానున్న టీ20 ప్రపంచ కప్ 2026లో భారత జట్టుకు ఈసారి పోటీ కాస్త కఠినంగానే ఉండబోతోందని భారత మాజీ క్రికెటర్ అనిల్ కుంబ్లే అభిప్రాయపడ్డాడు. భారత్ హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతున్నప్పటికీ, 2024లో టైటిల్ గెలిచిన జట్టుతో పోలిస్తే ప్రస్తుత జట్టు కొంత బలహీనంగా కనిపిస్తోందని ఆయన పేర్కొన్నారు. 2024లో రోహిత్ శర్మ సారథ్యంలో భారత జట్టు ఛాంపియన్‌గా నిలిచి 11 ఏళ్ల నిరీక్షణకు తెరదించిన సంగతి తెలిసిందే. దక్షిణాఫ్రికాతో జరిగిన ఫైనల్లో ఉత్కంఠభరిత విజయంతో టైటిల్ సాధించింది. ఆ టోర్నీలో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజా అనుభవం కీలకంగా మారింది. అయితే ఆ విజయం తర్వాత ఈ ముగ్గురు పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికారు. దీంతో ప్రస్తుతం సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలో కొత్త సమతుల్యతతో కూడిన జట్టు బరిలోకి దిగుతోంది. ప్రస్తుత జట్టు బలంగానే ఉందని కుంబ్లే స్పష్టం చేశాడు. బౌలింగ్ విభాగంలో మంచి ఎంపికలు ఉన్నాయని, బ్యాటింగ్‌లో టాప్ ఆర్డర్ పటిష్టంగా కనిపిస్తోందని చెప్పాడు. అయినప్పటికీ అనుభవం పరంగా రోహిత్, విరాట్‌ల లేమి స్పష్టంగా కనిపిస్తోందని వ్యాఖ్యానించాడు. 2024 ప్రపంచ కప్‌లో ఆడిన భారత జట్టు ప్రస్తుత జట్టుతో పోలిస్తే సుమారు 10 శాతం ముందుందని, అయినా ఇప్పుడు ఉన్న జట్టు ఆ స్థాయికి చాలా దగ్గరగా ఉందని ఆయన అభిప్రాయపడ్డాడు. ఈ ప్రపంచ కప్‌లో సూర్యకుమార్ యాదవ్ పాత్ర అత్యంత కీలకమని కుంబ్లే పేర్కొన్నాడు. బ్యాటర్‌గా రాణించడమే కాకుండా, కెప్టెన్‌గా జట్టును సమర్థంగా నడిపిస్తేనే భారత్ మరోసారి టైటిల్‌కు చేరువవుతుందని ఆయన తెలిపారు. మొత్తంగా ఈ టోర్నీ టీమిండియాకు సవాలుతో కూడుకున్నదే అయినప్పటికీ, సరైన ప్రదర్శనతో విజయాన్ని అందుకునే సామర్థ్యం జట్టుకు ఉందని అనిల్ కుంబ్లే విశ్వాసం వ్యక్తం చేశాడు.



## క్రికెట్లో కొత్త రూల్స్ వచ్చాయి.. ఆటే మారనుంది..!

హైదరాబాద్ , 03 ఫిబ్రవరి, మన గళం : క్రికెట్ ప్రపంచంలో సంచలనాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. క్రికెట్ నియమ నిబంధనలను రూపొందించే మేరిల్బోన్ క్రికెట్ క్లబ్ తాజా చట్టాలను ప్రకటించింది. మొత్తం 73 మార్పులతో రూపొందించిన ఈ కొత్త నియమావళి 2026 అక్టోబర్ 1 నుంచి ప్రపంచవ్యాప్తంగా అమల్లోకి రానుంది. ఆటను మరింత సరసమైనదిగా, సులభతరం చేయడమే లక్ష్యంగా ఈ మార్పులు తీసుకొచ్చినట్లు క్లబ్ తెలిపింది.

ఈ మార్పుల్లో అత్యంత కీలకమైనది అమేచ్యూర్ క్రికెట్‌కు సంబంధించిన బ్యాట్ల నిబంధన. ఇప్పటివరకు జూనియర్ క్రికెట్‌కే పరిమితమైన లామినేటెడ్ బ్యాట్లను ఇకపై వయోపరిమితి లేని అమేచ్యూర్ క్రికెట్‌లో ఉపయోగించుకోవచ్చని స్పష్టం చేసింది. ఇంగ్లిష్ విల్లో బ్యాట్ల ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో, సాధారణ ఆటగాళ్లపై ఆర్థిక భారం తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. లామినేటెడ్ బ్యాట్లలో ముందుభాగంలో ఇంగ్లిష్ విల్లో పొర, వెనుక భాగంలో తక్కువ ధర కలిగిన కలపను ఉపయోగిస్తారు. దీని వల్ల బ్యాట్ల ధర గణనీయంగా తగ్గుతుంది. అయితే ప్రొఫెషనల్ స్థాయి క్రికెట్‌లో మాత్రం ఇప్పటివరకు ఉన్నట్లే పూర్తి విల్లో బ్యాట్ల వాడకం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ఆటలో ఉత్కంఠను పెంచేలా మరికొన్ని కీలక మార్పులు కూడా ప్రకటించారు. బహుళ రోజుల మ్యాచ్‌లలో చివరి ఓవర్‌లో వికెట్ పడితే ఆ రోజుతో ఆట ముగించరాదని, ఆ ఓవర్‌ను పూర్తిగా ఆడించాల్సిందేనని కొత్త నిబంధన తీసుకొచ్చారు. బౌండరీ క్యాచ్‌ల విషయంలో కూడా కఠినమైన మార్పులు చేశారు. ఫీల్డర్ బౌండరీ లైన్ దాటి గాల్లోకి ఎగిరి బంతిని ఒకసారి మాత్రమే తాకాలి. తిరిగి పూర్తిగా మైదానంలోకి వచ్చాకే క్యాచ్ పూర్తి చేయాలి. రెండోసారి గాల్లో తాకితే అది బౌండరీగా పరిగణిస్తారు వికెట్ కీపింగ్ విషయంలోనూ స్పష్టత తీసుకొచ్చారు. బౌలర్ పరుగులు ప్రారంభించే సమయంలో వికెట్ కీపర్ గ్లోవ్స్ స్టంప్స్ ముందు ఉండొచ్చుగానీ, బంతి విడిచే క్షణంలో మాత్రం అవి తప్పనిసరిగా స్టంప్స్ వెనుక ఉండాలని పేర్కొన్నారు. మ్యాచ్ చివరి ఇన్నింగ్స్‌లో డిక్లరేషన్ ఇచ్చే అధికారాన్ని ఇకపై తొలగించారు. మహిళల క్రికెట్, జూనియర్ క్రికెట్‌లలో ఉపయోగించే బంతుల పరిమాణం, బరువుకు స్పష్టమైన ప్రమాణాలను నిర్ణయించారు. ఆటలో సమానత్వం కోసం మూడు రకాల బంతుల పరిమాణాలను ఖరారు చేశారు. అంతేకాకుండా నియమావళిలో లింగ వివక్షకు తావులేని పదజాలాన్ని ప్రవేశపెట్టారు. ఇంగ్లీషు మాతృభాష కానివారికి కూడా సులభంగా అర్థమయ్యేలా భాషను సరళతరం చేశారు. 1787 నుంచి క్రికెట్ చట్టాలను పరిరక్షిస్తున్న మేరిల్బోన్ క్రికెట్ క్లబ్, ఈ తాజా మార్పుల ద్వారా సంప్రదాయం, ఆధునికత మధ్య సమతుల్యత సాధిస్తూ క్రికెట్‌ను మరింత అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుంది.

## ఆరెంజ్ ఆర్మీకి కొత్త టెన్షన్.. కెప్టెన్ ఫిట్‌నెస్‌పై కలవరమే..!




హైదరాబాద్ , 03 ఫిబ్రవరి ,మన గళం : ఐపీఎల్ 2026 సీజన్‌కు సిద్ధమవుతున్న ఆరెంజ్ ఆర్మీకి అనుకోని టెన్షన్ మొదలైంది. జట్టు కెప్టెన్ ప్యాట్ కమిన్స్ పూర్తిస్థాయిలో ఫిట్ కాకపోతే జట్టు వ్యూహాల్లో మార్పులు చేయాల్సి వచ్చే అవకాశం ఉందని మేనేజ్‌మెంట్ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా బౌలింగ్ విభాగంలో కమిన్స్ అనుభవం, నాయకత్వం జట్టుకు కీలకమని కోచ్‌లు భావిస్తున్నారు. అతని గైర్హాజరీ జట్టు సమతుల్యతపై ప్రభావం చూపే అవకాశం ఉందన్న చర్చ సాగుతోంది. ఈ పరిస్థితిలో తాత్కాలికంగా కెప్టెన్సీ బాధ్యతలు ఎవరు చేపట్టాలి, బౌలింగ్ యూనిట్‌ను ఎవరు నడిపించాలి అన్న అంశాలపై జట్టు మేనేజ్‌మెంట్ అంతర్గతంగా చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. అయితే కమిన్స్ త్వరగా కోలుకుని టోర్నమెంట్ ఆరంభానికి అందుబాటులోకి వస్తాడనే ఆశను మాత్రం జట్టు వదులుకోవడం లేదు. వైద్య బృందం పర్యవేక్షణలో అతడు రికవరీ ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. గత సీజన్‌లో కమిన్స్ నాయకత్వంలో ఎస్ఆర్‌హెచ్ జట్టు అంచనాలను మించి ప్రదర్శన చేసింది. అదే ఉత్సాహాన్ని ఈసారి కూడా కొనసాగించాలని అభిమానులు కోరుకుంటున్నారు. సోషల్ మీడియాలో కమిన్స్ త్వరగా కోలుకోవాలంటూ అభిమానులు సందేశాలు పోస్ట్ చేస్తూ తమ మద్దతు తెలియజేస్తున్నారు. ఐపీఎల్ 2026 ఆరంభానికి ముందు ఈ టెన్షన్ నుంచి ఆరెంజ్ ఆర్మీ బయటపడుతుందా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.

# పాకిస్థాన్ జట్టు బలహీనంగా ఉంది..



ముంబై , 03 ఫిబ్రవరి ,మన గళం : ప్రస్తుతం పాకిస్థాన్ క్రికెట్ జట్టు చాలా బలహీనంగా మారిందని భారత మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ వ్యాఖ్యానించారు. భారత్‌తో మ్యాచ్ జరిగినా, గతంలో ఉన్న ఉత్కంఠ, రసవత్తరం ఇప్పుడు కనిపించడం లేదని ఆయన స్పష్టం చేశారు. ఒకప్పుడు దాయాదుల సమరం అంటే అభిమానుల్లో ఉత్కంఠ నెలకొనేదని, కానీ ఇప్పుడు ఆ మజా పూర్తిగా తగ్గిపోయిందని తెలిపారు. పాకిస్థాన్‌తో మ్యాచ్ కంటే ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా జట్లతో తలపడినప్పుడు మాత్రమే నిజమైన పోటీ కనిపిస్తోందని మంజ్రేకర్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం భారత్‌కు పాకిస్థాన్ సరైన పోటీ ఇవ్వలేకపోతోందని, మ్యాచ్‌లు ఏకపక్షంగా మారుతున్నాయని అన్నారు. తొంభైల దశకంలో పాకిస్థాన్ జట్టు భయంకరంగా ఉండేదని, ఎప్పుడైనా ఫలితం మారిపోయే పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు ఆ స్థాయి ఆట ఆ జట్టులో కనిపించడం లేదని విమర్శించారు. పాకిస్థాన్‌తో తలపడుతున్నప్పుడు ఏదో చిన్న జట్టుతో మ్యాచ్ ఆడుతున్నట్టుగా అనిపిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు్.

Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP.
Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.